క్లుప్తంగా

నగరపాలక సంస్థ ఉద్యోగులకు మెమోలు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థకు చెందిన ఇద్దరు ఉద్యోగులకు కమిషనర్ కీర్తి చేకూరి సోమవారం మెమోలు జారీ చేశారు. అవుట్ సోర్సింగ్ కార్మికుల వివరాలు తెలియజేయాలని కొద్ది నెలల కిందట జరిగిన కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్లు అడిగిన ప్రశ్నకు వివరాలను తప్పుగా ఇవ్వడంతో పాటు కౌన్సిల్‌ను తప్పుదోవ పట్టించిన అప్పటి ఇంజినీరింగ్ సూపరింటెండెంట్ షాదిక్ పాషాను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఈ విషయంలో అప్పటి కౌన్సిల్ సమావేశంలో ఎలాంటి వివరాలు ఇచ్చారో తెలపాలంటూ సూపరింటెండెంట్ మదన్ గోపాల్, ఇంజినీరింగ్ సెక్షన్ ఈ–2 సుబ్బారావుకు మెమోలు జారీ చేశారు.

ద్విచక్రవాహనం దగ్ధంపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ఇంటి ముందు నిలిపిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు తగులబెట్టిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. కేవీపీ కాలనీ 2/8లో నివసించే ఎం.వెంకటేష్ ఈనెల 8న ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు నిలిపి లోపలకు వెళ్లాడు. సోమవారం ఉదయం బయటకు వచ్చి చూసేసరికి వాహనం తగులబడి ఉంది. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు

ఆన్‌లైన్ మోసంపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. అంకమ్మనగర్‌కు చెందిన ఆషా శ్రీనివాస్ పాత గోతాల వ్యాపారం చేస్తుంటాడు. సెప్టెంబరు 24న ఆయన సెల్‌కు మెసేజ్ లింక్ వచ్చింది. గుర్తు తెలియని వ్యక్తులు గ్రూపు క్రియేట్ చేసి గేమ్‌కు సంబంధించి టాస్క్ పంపారు. ఒక్కో టాస్క్ పూర్తి చేస్తే మెసేజ్ వస్తుందని చెప్పారు. శ్రీనివాస్‌కు 25 టాస్క్‌లు పంపారు. ఇందుకు శ్రీనివాస్ తనకు సంబంధించిన మూడు బ్యాంకుల్లోని అకౌంట్ వివరాలు గ్రూప్ అడ్మిన్‌కు పంపాడు. కొద్దిరోజుల తరువాత శ్రీనివాస్ అకౌంట్‌లో రూ. 6.90 లక్షలు విత్‌డ్రా అయ్యాయి. తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థిపై దాడి

పట్నంబజారు: కళాశాలలో ఘర్షణ నేపథ్యంలో విద్యార్థిపై దాడి చేసిన ఘటనపై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకాని రోడ్డులో నివసించే బాలాజీ శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. అదే కళాశాలకు చెందిన నాగసాయితో కొంతకాలం కిందట వివాదం జరిగింది. ఈ నేపథ్యంలో నాగసాయి, మరికొంత మంది కలసి బాలాజీపై కాకాని రోడ్డులో దాడి చేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిని బెదిరించిన ఘటనపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: వ్యక్తిని కొందరు బెదిరించి ప్రాంసరీ నోట్లు రాయించుకున్న ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వికాస్‌నగర్ 2వ లైనులో నివసించే కుడితిపూడి వెంకట కృష్ణారావు ఈనెల 6న ఇంట్లో ఉండగా, బృందావన్ గార్డెన్స్‌కు చెందిన నిమ్మలగడ్డ అరుణ్‌కుమారి, విద్యానగర్‌కు చెందిన పూనాటి రమేష్, సురేష్‌బాబు అనుచరులతో వచ్చారు. ఆర్థిక లావాదేవీల్లో ఏర్పడిన వివాదం కారణంగా వెంకట కృష్ణారావును బెదిరించి నాలుగు ప్రాంసరీ నోట్లు రాయించుకుని వెళ్లారు. ఈ మేరకు ఆయన సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై దాడి

సోదరుడి కుమారుడిపై దాడి చేసిన వ్యక్తిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. కోబాల్ట్‌పేటలో నివసించే ఒర్సుమల్ల దిలీప్‌రాజా ఈనెల 5న చెత్త బయట పడేసేందుకు ఇంట్లోంచి బయటకు వెళ్లాడు. పాత కక్షల నేపథ్యంలో అతడి బాబాయి వెనుకగా వచ్చి ఇనుప రాడ్‌తో తలపై కొట్టగా గాయపడ్డాడు. చికిత్స అనంతరం బాధితుడు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం

యువతి అదృశ్యంపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. బ్రాడీపేటలో నివసించే ఓ కుటుంబానికి చెందిన యువతి సోమవారం ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఎటో వెళ్లి పోయింది. ఆమె ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృథాగా పోతున్న తాగునీరు




నెహ్రూనగర్: నగరంలో కొన్ని ప్రాంతాల్లో అక్కడక్కడా పైపులైన్లకు లీకులు ఏర్పడి తాగునీరు వృథాగా పోతున్నా ఇంజినీరింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. తుపాన్ నగర్ (మహాప్రస్థానం) వెళ్లే రోడ్డులో కొద్ది రోజులుగా రోడ్డు వెంట తాగునీరు వృథాగా పోతోంది. దీంతో ఇంజినీరింగ్ అధికారుల తీరుపై స్థానిక ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి తాగునీటి వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

శాంతం లేక సౌఖ్యం లేదు బ్రో.. !

ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం బిలియన్ ప్రజలు వివిధ రకాల మానసిక సమస్యలతో బాధపడుతున్నారు. ఏటా మానసిక సమస్యలతో మూడు మిలియన్ల దాకా చనిపోతున్నారు. ఆధునిక సాంకేతిక పెరిగేకొద్దీ మానసిక సమస్యలు కూడా ఏటికేడు పెరుగుతున్నాయి. పిల్లలు, పెద్దవారు అనే తేడా లేకుండా అందరూ పలు మానసిక సమస్యలతో బాధపడుతున్నారు. కోవిడ్– 19 వల్ల పెరిగిన బాధితుల్ని దృష్టిలో పెట్టుకుని ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలు మానసిక ఆరోగ్యానికి ఎక్కువ నిధులు కేటాయించడంతో పాటు వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. మానసిక సమస్యలపై అవగాహన కల్పించి ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఏటా అక్టోబర్ 10న ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది మానసిక ఆరోగ్యం అనేది సార్వత్రిక మానవ హక్కు అనే నినాదంతో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం.

– గుంటూరు మెడికల్



- ఏటా పెరుగుతున్న మానసిక సమస్యలు
- నేడు అందుబాటులో ఆధునిక మందులు
- వైద్యుల పర్యవేక్షణలో వాడితే నివారణ
- 10న ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం

గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందిన వారి వివరాలు..

సంవత్సరం	పురుషులు	స్త్రీలు	మగపిల్లలు	ఆడపిల్లలు	మొత్తం బాధితులు
2011	11,648	9,348	355	261	21,945
2012	12,535	9,107	295	212	21,277
2013	11,960	9,463	237	134	21,632
2014	12,819	10,237	394	281	23,731
2015	12,782	10,069	362	241	23,486
2016	13,574	11,453	382	244	25,653
2017	14,282	11,376	611	371	26,669
2018	14,318	11,489	657	392	26,856
2019	14,512	11,523	668	397	27,100
2020	8,740	7,107	443	233	16,523
2021	12,184	10,078	291	173	22,726
2022	15,233	13,064	583	328	29,208
2023 (సెప్టెంబరు వరకు)	12,022	9,620	512	267	22,421

గుంటూరు జిల్లాలో 25 మంది మానసికవ్యాధి వైద్య నిపుణులున్నారు. ఒక్కో వైద్యుడి వద్దకు రోజూ 30 నుంచి 50 మంది వివిధ రకాల వ్యాధులతో చికిత్స కోసం వస్తున్నారు. గుంటూరు జీజీహెచ్‌లో ప్రతిరోజూ 250 మంది వివిధ రకాల మానసిక సమస్యలతో చికిత్స పొందుతున్నారు. ప్రతి ఏడాది రోగుల సంఖ్య పెరిగిపోవడంపై వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిల్లల్లో సైతం మానసిక సమస్యలు రావడంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు.

మానసికవ్యాధి లక్షణాలు

- చికాకు, కోపం, విసుగు తదితర లక్షణాలు వారానికి పైబడి ఉంటే మానసిక వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించాలి.
- తనలోతాను మాట్లాడుకోవడం, ఒంటరిగా తనొక్కడే ఉండి నవ్వుకోవడం, వ్యక్తిగత శ్రద్ధ తీసుకోకపోవడం
- చేసిన పనిని పదేపదే చేయాలనుకోవడం, అనవసరమైన ఆలోచల్ని ఆపుకోలేకపోవడం
- నిద్రలోపం, బరువు పెరగడం, నిర్ణయాలు తీసుకోవడంలో తీవ్ర జాప్యం
- తనమీద ఆధారపడే వారందరిని ఇబ్బందికి గురిచేస్తూ తాను కూడా ఇబ్బందులకు గురవ్వడం
- ఎక్కువ సమయం పనిమీద ఏకాగ్రత లేకుండా కాలక్షేపం చేసే ధోరణిలో ఉండటం
- తనకు హాని చేస్తున్నట్లు ఊహించుకుని తగాదాలు వరకు వెళ్లడం, తిరగబడి దాడి చేయడం
- వ్యక్తిలో అనుమానాల్ని ఎన్ని రూపాల్లో నివృత్తి చేసే ప్రయత్నం చేసినా ఒప్పుకోకపోవడం తదితర లక్షణాలు మానసిక వ్యాధి సోకిన వారిలో కనిపిస్తాయి.

రావడానికి కారణాలు

మానసిక జబ్బులు వంశపారంపర్యంగా ఎక్కువగా వస్తాయి. మెదడులో రసాయనాలు ఊరడంలో మార్పు వల్ల , గడ్డలు ఏర్పడం వల్ల వస్తాయి. మెదడులో డోపమిన్ హార్మోన్ లోపం వల్ల , హార్మోన్ సమతుల్యం వల్ల కూడా మానసిక జబ్బులు వస్తాయి.అసమానత్వం, పుట్టుకతో మెదడు సరిగ్గా ఎదగకపోవడం వల్ల వస్తాయి. ఫిట్స్ వల్ల, మందు, పొగ తాగడం వల్ల కూడా వచ్చే అవకాశం ఉంది. ఉద్యోగంలో, పనిలో, చదువులో ఒత్తిడి, ఆలుమగల మధ్య సఖ్యత లోపించి తరచుగా వివాదాలు జరుగుతూ ఉండటం, నిద్రలేమి, తీవ్రమైన ఒత్తిడి, వ్యక్తిగత సమస్యలకు పరిష్కారం దొరకనప్పుడు మానసిక వ్యాధులొస్తాయి. ఎక్కువగా 20 నుంచి 25 ఏళ్ల మధ్య వయస్సులోనే వచ్చే అవకాశాలు ఉన్నాయి.

మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలి



ఆందోళనకు గురిచేసే విషయాలను పట్టించుకోకుండా, మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవాలి. మద్యం, పొగతాగడం లాంటి వ్యసనాలకు దూరంగా ఉండాలి. కంటికి సరిపడా ఆరు నుంచి తొమ్మిది గంటల పాటు నిద్రపోవాలి.కుటుంబ సభ్యులందరితో కలసి కొంత సమయాన్ని గడపాలి. ప్రతి రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి.మానసిక వ్యాధులకు నేడు ఆధునిక మందులు అందుబాటులోకి వచ్చాయి. మొదటి దశలోనే గుర్తిస్తే త్వరిగగతిన నయం చేసేందుకు అవకాశం ఉంది.

– డాక్టర్ ఐ.వి.ఎల్.నరసింహారావు, మానసిక వ్యాధి నిపుణులు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

జీజీహెచ్‌లో ఉచిత వైద్య సేవలు



మానసిక వ్యాధులకు జీజీహెచ్‌లో ఉచిత వైద్య సేవలతోపాటు మందులు కూడా ఉచితంగానే అందజేస్తున్నారు. అవుట్ పేషెంట్ విభాగంలోని రెండో నంబర్ గదిలో రోగులు పేర్లు నమోదు చేయించుకొని ఆ చీటీతో ఓపీ విభాగంలోని 21 నంబర్ గదికి వెళ్లాలి. అక్కడ వైద్య పరీక్షలు చేసి అవసరం ఉన్న వారిని ఇన్‌పేషెంట్ విభాగంలో అడ్మిట్ చేసుకుంటారు. సోమవారం నుంచి శనివారం వరకు ప్రతి రోజూ ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓపీలో వైద్య సేవలు లభిస్తాయి. ఆడా,మగా తేడా లేకుండా అందరికీ మానసిక సమస్యలు వస్తాయి. మందులతో వాటిని నయం చేయవచ్చు. రోగులకు కౌన్సిలింగ్ చాలా ముఖ్యం. వ్యాధిగ్రస్తుల్ని కుటుంబ సభ్యుల పర్యవేక్షిస్తూ మందులు సక్రమంగా మింగేలా చేస్తే త్వరితగతిన బయటపడతారు.

– డాక్టర్ వడ్డాది వెంకటకిరణ్, అసోసియేట్ ప్రొఫెసర్, గుంటూరు జీజీహెచ్

జీజీహెచ్ అభివృద్ధికి దాతల విరాళం



గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కోసం పలువురు దాతలు ముందుకు రావడం అభినందనీయమని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ అన్నారు. సోమవారం ఆయన జన్మ దినోత్సవం సందర్భంగా దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రూ.50వేల ఆర్థికసాయం చేశారు. గ్లోబల్ డయాగ్నస్టిక్ సెంటర్ నిర్వాహకులు లక్ష్మణ్ రూ. 10 వేలు, జీజీహెచ్ ఆరోగ్యశ్రీ సిబ్బంది రూ. 10 వేలు, మమతా మెడికల్స్ నిర్వాహకులు చంద్రశేఖర్ రూ.10 వేలు, జయలక్ష్మి ఏజెన్సీస్, ఐక్యత ఆరదో నీడ్స్, రైన్‌బో బ్లడ్ బాంక్ రూ. 5వేలు, సిరక్స్ బయో మెడికల్ సిబ్బంది రూ. 5 వేలు విలువ గల ఫింగర్ పల్స్ ఆక్సీమీటర్స్ అందజేసి, డాక్టర్ కిరణ్ కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వేణు, కార్తిక్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గృహ కార్మికులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



గుంటూరు ఎడ్యుకేషన్: గృహ కార్మికులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని హ్యాపెన్ ఫీల్డ్ కో–ఆర్డినేటర్ సీహెచ్. అమ్మాజీ పేర్కొన్నారు. మల్లికార్జునపేటలోని సెయింట్ ఆన్స్ మనోవికాస కేంద్రంలో సోమవారం ఆంధ్రప్రదేశ్ గృహ కార్మికుల సమాఖ్య నగర స్థాయి కార్యనిర్వాహక సమావేశాన్ని నిర్వహించారు. ఇళ్లలో పని చేస్తున్న మహిళలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి అమ్మాజీ వివరించారు. ఈ సందర్భంగా సంఘ నగర శాఖ అధ్యక్షురాలిగా రెడ్డి దుర్గ, కార్యదర్శిగా బి. లావణ్య, మరో ఏడుగురు కార్యవర్గ సభ్యుల్ని ఎన్నుకున్నారు. మాంట్‌ఫోర్ట్ సోషల్ ఇనిస్టిట్యూట్, అందేరీ హిల్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఎంఎస్ఐ ఫీల్డ్ కో–ఆర్డినేటర్ సిస్టర్ వ్యాకుల మేరి, గృహ కార్మిక మహిళలు పాల్గొన్నారు.



విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో సోమవారం జరిగిన వైఎస్సార్ సీపీ ప్రతినిధుల సభకు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా హాజరయ్యారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని ఆసాంతం ఆసక్తిగా వీక్షించారు.

ఆరోగ్య సురక్షతో ప్రజల ఆరోగ్యానికి రక్ష

వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా

పట్నంబజారు: జగనన్న ఆరోగ్య సురక్షను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా చెప్పారు. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా ఆదేశాల మేరకు సోమవారం మూడో డివిజన్ పరిధిలోని ప్రగతీనగర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌ను ఆమె పరిశీలించారు. మహిళలు, వృద్ధులతో మాట్లాడి వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఉచిత పరీక్షలు, మందుల గురించి ఆమె వివరించారు. అవసరమైతే ఆసుపత్రిలో ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా చికిత్స అందజేస్తారని చెప్పారు. ఈ సందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి పేద ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించే దిశగా తీసుకున్న ఒక గొప్ప నిర్ణయంగా జగనన్న ఆరోగ్య సురక్షను పేర్కొన్నారు. ప్రతి ఇంటిలోనూ అనారోగ్య సమస్యలు తెలుసుకుని మెరుగైన చికిత్స అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పోలవరపు జ్యోతి , వెంకటేశ్వరరావు, రామనబోయిన అజయ్, పాస్టర్ రమేష్, సైదా, బ్రహ్మనాయుడు, స్వర్ణ, రాంబాబు, లీలా, పాల్, రఘు, మహేష్, సింగయ్య పాల్గొన్నారు.



వైద్యానికి వచ్చిన వృద్ధురాలితో మాట్లాడుతున్న నూరిఫాతిమా

స్పందన ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత

- విభాగాధిపతే నేరుగా పరిశీలించాలి
- నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశం

నెహ్రూనగర్: ప్రజల నుంచి అందే ఫిర్యాదులతో పాటు అర్జీలు రీ ఓపెన్ అయితే విభాగాధిపతే నేరుగా పరిశీలించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో సోమవారం స్పందన నిర్వహించారు. తొలుత గత వారం స్పందనలో అందిన అర్జీల పరిష్కారంపై సమీక్షించారు. కొన్ని విభాగాల అధికారులు ఫిర్యాదు పరిష్కారం కాకుండానే క్లోజ్ చేస్తున్నారని, ప్రజలు తిరిగి ఫిర్యాదు రీ ఓపెన్ చేస్తున్నారని ఆమె తెలిపారు. సదరు అర్జీలను విభాగాధిపతే నేరుగా పరిశీలించి పరిష్కరించాలని, సిబ్బంది నిర్లక్ష్యం ఉంటే చర్యలకు సిఫార్సు చేయాలని ఆమె ఆదేశించారు. అనంతరం కమిషనర్ ప్రజల నుంచి అర్జీలు తీసుకున్నారు.

ప్రజల నుంచి 55 ఫిర్యాదులు

ప్రజల నుంచి స్పందనలో 55 ఫిర్యాదులు అందాయి. ఇందులో పట్టణ ప్రణాళిక విభాగానికి 12, ఇంజినీరింగ్ విభాగానికి 19, రెవెన్యూ విభాగానికి 8, ప్రజారోగ్య విభాగానికి 12, ఉపా సెల్ విభాగానికి 4 ఫిర్యాదులు అందాయి. వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారుల్ని కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.రోజా, డెప్యూటీ కమిషనర్ సీహెచ్. శ్రీనివాస్, ఎస్ఈ భాస్కర్, సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, మేనేజర్ శివన్నారాయణ, ఉపా సెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ఏసీపీలు, ఈఈలు, ఎస్ఎస్‌లు, సూపరిండెంట్లు పాల్గొన్నారు.



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటాం

నగరపాలక సంస్థ కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటామని, వారికి అందాల్సిన పరిహారాలు వెంటనే అందిచడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని నగర నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. ఇటీవల మరణించిన ప్రజారోగ్య కార్మికుడు ఆగిపోగు అజయ్ కుమార్ కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్‌ను సోమవారం కౌన్సిల్ హాల్లో కమిషనర్ అందించారు. నగరపాలక సంస్థ నుంచి అందాల్సిన పరిహారాలు, పీఎఫ్ త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత విభాగాధిపతులు, సూపరింటెండెంట్లను ఆదేశించారు.

విద్యార్థుల అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర కీలకం



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో తల్లితండ్రులది కీలకపాత్రని టీజేపీఎస్ కళాశాల కరస్పాండెంట్ కె.వి. బ్రహ్మం పేర్కొన్నారు. పట్టాభిపురంలోని కళాశాలలో సోమవారం విద్యార్థులు – తల్లిదండ్రులు సమావేశం నిర్వహించారు. బ్రహ్మం మాట్లాడుతూ పిల్లల్ని కళాశాలలో చేర్పించడంతో పేరెంట్స్ బాధ్యత నెరవేరినట్టు కాదని చెప్పారు. తరచుగా కళాశాలకు వచ్చి విద్యార్థుల గురించి తెలుసుకోవాలని సూచించారు. పిల్లల అభివృద్ధిలో గురువులతో పాటు తల్లిదండ్రులకు సైతం బాధ్యత ఉందని తెలిపారు. విద్యార్థుల్ని చెడుతోవ పట్టించే మొబైల్, చెడు స్నేహాలు, వ్యసనాలను గుర్తించడంతో పాటు వారి ఆలోచనల్ని గమనిస్తూ ఉండాలని సూచించారు. కళాశాలలోని అన్ని సౌకర్యాల్ని విద్యార్థులు వినియోగించుకుని జీవితంలో అభివృద్ధి చెంది, తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు, ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్, వైస్ ప్రిన్సిపాల్ బాను మురళి, మార్కండేయులు, కవిత, స్వామి, శ్రీనివాస్, బాజీ, పి.కుమార్ పాల్గొన్నారు.

కాన్షీరామ్‌కు ఘన నివాళులు

నెహ్రూనగర్: బడుగు, బలహీన వర్గాల ప్రజల్ని చట్టసభల్లోకి నడిపించిన గొప్ప నాయకుడు కాన్షీరామ్ అని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్ పేర్కొన్నారు. కాన్షీరాం వర్ధంతిని పురస్కరించుకుని ఏసీ కాలేజీ ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాన్షీరాంను ఆదర్శంగా తీసుకుని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు ప్రత్యామ్నాయ రాజకీయ దిశగా అడుగులు వేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు నరసింహారావు, వెంకటేశ్వరరావు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

- బహుజనులంతా ఏకమై రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని బహుజన మహాసేన రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు చింతా రాంప్రసాద్ పేర్కొన్నారు. కాన్షీరామ్ వర్ధంతిని పురస్కరించుకుని ఏసీ కాలేజీ ఎదురుగా ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వర్ధన్ యాదవ్, రవితేజ, నాగరాజు, సాధిక్, వెంకటేశ్వర్లు, భాస్కర్ పాల్గొన్నారు.
- బహుజన సమాజం నిర్మించేందుకు అహర్నిశలు కృషి చేసిన కాన్షీరామ్ చిరస్మరణీయులని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏసుబాబుమాదిగ తెలియజేశారు. కాకాని రోడ్డులోని సంఘ కార్యాలయంలో కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సుబ్బయ్య, కిశోర్, రవికుమార్, ప్రసాద్, అబ్రహం, సుభాని, లక్ష్మణ్ పాల్గొన్నారు.
- రాష్ట్ర రజక జన సేవా సంఘం ఆధ్వర్యంలో పాత గుంటూరులో కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ బహుజనులకు రాజ్యాధికారాన్ని సాధించిన గొప్ప నాయకుడు కాన్షీరామ్ అని కొనియాడారు.



కాన్షీరామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘ నాయకులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుంటూరు ఈస్ట్: రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీ–4 సెక్షన్ డెప్యూటీ ఇంజినీర్ సుబ్బరాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలకలూరు రోడ్డు, కృష్ణబాబు కాలనీ, సాయిబాబానగర్, రత్నగిరి కాలనీల్లో అంతరాయం ఏర్పడుతోందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఉపాధ్యాయురాలి దాతృత్వం

గుంటూరు ఎడ్యుకేషన్: ఎన్నారై ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాలలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న మద్దు మేరీ వరకుమారి తన వేతనంలో ప్రతి నెలా రూ.14వేలను 15 మంది పేద విద్యార్థులకు ఫీజుల రూపంలో చెల్లిస్తూ దాతృత్వాన్ని చాటుతున్నారు. విద్యానగర్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు అచీవర్స్ అధ్యక్షుడు పిడికిటి తిలక్‌బాబు సూచన మేరకు సంబంధిత విద్యార్థులకు చెక్కు రూపంలో ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తిలక్‌బాబు మాట్లాడుతూ గత మూడేళ్లుగా వరకుమారి విద్యార్థుల ఫీజుల కోసం 3.50 లక్షల మేరకు ఆర్థిక సహాయాన్ని అందించారని, 15 మంది విద్యార్థులకు ఆమె ఆసరాగా ఉంటున్నారని వివరించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆమె కేవీఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయినిగా పురస్కారాన్ని సైతం అందుకున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయిని వరకుమారి మాట్లాడుతూ ఒక టీచర్‌గా పని చేస్తున్న తాను పేద విద్యార్థులను చదివించడం సామాజిక బాధ్యతగా భావించి ఆర్థికంగా సహాయ, సహకారాలు అందిస్తున్నానని చెప్పారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు కోశాధికారి విజయకృష్ణ, పాఠశాల ప్రిన్సిపాల్ నవీన్ చౌదరి పాల్గొన్నారు.



విద్యార్థులతో మేరీ వరకుమారి, తిలక్‌బాబు, విజయకృష్ణ

న్యూజిలాండ్ నుంచి శాంతమూర్తికి ఆహ్వానం



గుంటూరు ఎడ్యుకేషన్: న్యూజిలాండ్‌లోని మన ఆంధ్ర తెలుగు అసోసియేషన్ (మాటా) ఆధ్వర్యంలో ఈనెల 28న జరగనున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రావతరణ వేడుకలకు గుంటూరు అమరావతి రోడ్డుకు చెందిన అవర్‌స్టేట్–అవర్ లీడర్, వైఎస్సార్ ఇంటిలెక్చువల్ ఫోరం సంస్థల వ్యవస్థాపక అధ్యక్షుడు జి. శాంతమూర్తికి ఆహ్వానం అందింది. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. న్యూజిలాండ్‌లో నిర్వహించనున్న ఆంధ్ర రాష్ట్రావతరణ వేడుకల్లో తెలుగుజాతి గర్వపడేలా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారని ఆయన పేర్కొన్నారు.